

నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

**19** వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

మంగళవారం,3 మార్చి 2026 | 8 పేజీలు


# లోవ 'విశ్వనాధ' లీలలు..



## భక్తి ముసుగులో అవినీతి కోరలు!

- అమ్మవారి సన్నిధిలో అరాచకాల పర్వం - అసిస్టెంట్ కమిషనర్ ఇలాకాలో అదుపు తప్పిన పాలన!
- నిబంధనల ఉల్లంఘనే ఈవో నైజం - భక్తుల కానుకలతో పెనాల్టీల చెల్లింపు!
- సత్రాల్లో మద్యం బాటిళ్ల జాతర - మత్తులో తూగుతున్న సిబ్బంది!
- అడుగడుగునా భక్తులను అధిక ధరల దోపిడీ - అక్రమ మార్గంలో షాపుల కేటాయింపు !



అపవిత్ర పాలన

ఈవో 'చీకటి' పాలన..!

'అవినీతి' లోగుట్టు

'అనధికార' పాలన..



అమ్మ శిఖరం క్షేత్రం...క్రింద ఈవో కార్యాలయం

కోట్లాది మంది భక్తుల కొంగుబంగారమై, మహిమలకు పురిటిగడ్డగా విరాజిల్లుతున్న శ్రీ తలంపులమ్మ క్షేత్రం నేడు అధికారుల అక్రమాలకు అల్లాడుతోంది. ఒకవైపు అర్చకులు నిష్టతో వేదమంత్రోచ్చారణలు చేస్తుంటే, మరోవైపు ఈవో పి.విశ్వనాధ రాజు అండతో మద్యం బాటిళ్ల జాతర సాగుతోంది. అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారి అయి ఉండి, డిప్యూటీ కమిషనర్ పదవిని వెలగబెడుతూ ఐదేళ్లుగా ఇక్కడే తిష్టవేసి, సాక్షాత్తూ కమిషనర్ ఆదేశాలనే బేఖాతరు చేయడంతో రెండు ప్రభుత్వ శాఖల నుండి నోటీసులు రావడం గమనార్హం. ఈ తప్పిదాలకు పడ్డ భారీ అపరాధ రుసుములను సైతం సొంత జేబు నుండి కాకుండా భక్తుల కానుకల నుండే చెల్లిస్తున్న వైనం విస్మయానికి గురిచేస్తోంది. అడుగడుగునా ధరల దోపిడీ, అక్రమ మార్గంలో షాపుల కేటాయింపులతో సాగుతున్న ఈ 'అవినీతి అష్టభుజి'ని ఛేదించేందుకు కేంద్ర ఆడిట్ బృందం రంగంలోకి దిగుతున్న వేళ, 'సూర్య' అందిస్తున్న సంచలన ప్రత్యేక కథనం!

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- మిగతా 2 లో..

# కాకినాడ 'సీజన్స్ 5'లో తనిఖీల కలకలం

- ప్లేటులో రుచి.. కిచెన్‌లో కుళ్లు!
- మల్టీ డిపార్ట్‌మెంట్ రైడ్స్‌తో హోటల్ మాఫియా గుండెల్లో రైళ్లు..
- లక్ష దాటిన గ్యాస్ బిల్లు - పన్ను ఎగవేతపై అధికారుల నజర్
- నిల్వ మాంసం, టేస్టింగ్ సాల్ట్, ప్రాసెస్ ఫుడ్ సీజ్
- హైజినిక్‌గా చేయాలని హెచ్చరిక

కాకినాడ స్మార్ట్ సిటీలోని రాజా ట్యాంక్ సమీపంలో గల 'సీజన్స్ 5' రెస్టారెంట్‌పై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏకకాలంలో మెరుపు దాడులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి సత్యనారాయణరాజు హెచ్చరిస్తూ, రుచి పేరుతో వినియోగదారులను ఆకర్షిస్తూ అపరిశుభ్ర వాతావరణంలో నాణ్యత లేని నిల్వ మాంసాన్ని వడ్డిస్తే సహించేది లేదని, ప్రతిరోజూ తాజా మాంసాన్నే వాడాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రసాద్ పచ్చి మాంసంతో పాటు నిషేధిత టేస్టింగ్ సాల్ట్‌ను గుర్తించి సీజ్ చేశారని, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన వండిన మాంసం నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు వెల్లడించారు. అటు కమర్షియల్ టాక్స్ అధికారులు రెస్టారెంట్ నెలకు రూ.1,00,876 గ్యాస్ బిల్లు చెల్లిస్తున్నట్లు గుర్తించి, ఆవినియోగానికి తగ్గట్లుగా అమ్మకాల లెక్కలు ఉన్నాయో లేదోనని ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. దీనిపై సూర్య కథనం.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :









స్మార్ట్ సిటీలో పేరొందిన రెస్టారెంట్లు రంగురంగుల విద్యుత్ దీపాలు, ఏసీ హంగులతో కస్టమర్లను ఆకర్షిస్తున్నాయి. కానీ ఆ మెరుపుల వెనుక 'కుళ్లిన' నిజాలు దాగి ఉన్నాయని తాజాగా జరిగిన దాడులు నిరూపించాయి. రాజా ట్యాంక్ సమీపంలోని ప్రముఖ 'సీజన్స్ 5' రెస్టారెంట్‌పై వివిధ ప్రభుత్వ శాఖలు ఏకకాలంలో విరుచుకుపడటంతో నగరంలోని హోటల్ యజమానుల్లో వణుకు మొదలైంది.

**గ్యాస్ బిల్లుతో సేల్స్ గుట్టు రట్టు!**

ఈ తనిఖీల్లో కమర్షియల్ టాక్స్ అధికారులు సేకరించిన ఆధారాలు విస్తుగొలుపుతున్నాయి. సదరు రెస్టారెంట్‌కు సంబంధించి భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ జారీ చేసిన తాజా ఇన్వాయిస్ ప్రకారం.. కేవలం ఒక నెలకే రూ. 1,00,876 గ్యాస్ బిల్లు చెల్లించినట్లు వెల్లడైంది. ఇంత భారీ మొత్తంలో గ్యాస్ వినియోగం జరుగుతుందంటే, అక్కడ రోజువారీ అమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సేల్స్ లెక్కలకు, కడుతున్న పన్నులకు ఏమాత్రం పొంతన లేదని ప్రాథమిక తనిఖీల్లో తేలినట్లు సమాచారం.

**జొమాటో బిల్లుల్లో లొసుగులు?**


తనిఖీల్లో భాగంగా అధికారులు ఆన్‌లైన్ ఆర్డర్లకు సంబంధించిన బిల్లులను కూడా స్వాధీనం చేసుకున్నారు. జొమాటో ద్వారా జరుగుతున్న అమ్మకాల్లో పన్నుల చెల్లింపు ఎలా ఉందనే కోణంలో పరిశీలిస్తున్నారు. కస్టమర్లకు ఇస్తున్న కొన్ని బిల్లులు కేవలం 'ఎస్టిమేట్' లేదా 'ట్యాక్స్ ఇన్వాయిస్' కానివిగా ఉండటంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

- తరువాయి 2లో..

# లోవ 'విశ్వనాథ' లీలలు..



అపరాధ రుసుము రూ.15,000లు చెల్లించి తప్పు ఒప్పుకున్న ఈవో విశ్వనాథరాజు



లోవ ప్రసాదం తూకంలో మోసం... నోటీసులు జారీ చేసిన శాఖ

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

కొండ కోనల మధ్య కొలువై, కోట్లాది మంది భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న శ్రీతలంపులమ్మ అమ్మవారిక్షేత్రం మహిమలకు పురిటిగడ్డ. ఇక్కడి అర్చకులు అత్యంత నిష్టతో, వేదమంత్రోచ్ఛారణలతోజరిపే పూజలు భక్తులకు ఆధ్యాత్మిక పరవశాన్ని కలిగిస్తాయి. కానీ,ఇంతటి దివ్య క్షేత్రంనేడు ఈవో పి.విశ్వనాథ రాజుస్వార్ధానికి,అవినీతికి బలైపోతోంది. పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలకు బదులు మద్యం బాటిళ్ల చప్పుడు వినిపిస్తోంది. ధర్మం వెల్లివిరియాల్సిన చోట, ఈవో అండతో అధర్మం రాజ్యమేలుతోంది. ఇది అమ్మవారికి చేస్తున్న ద్రోహమా? లేక భక్తుల నమ్మకాన్ని విశ్వనాధ రాజు చేస్తున్న బలిపీఠమా?

**నోటీసుల పర్వం.. భక్తుల సొమ్ముతో పాప పరిహారం**

అసిస్టెంట్ కమిషనర్ స్ధాయి అధికారి అయి ఉండి, డిప్యూటీ కమిషనర్ స్థాయి పదవిని వెలగబెడుతూ గత 5 ఏళ్లకు పైగా ఇక్కడే 'లాంగ్ స్టాండింగ్'లో పాతుకుపోయిన ఈఅధికారి, అవినీతి ముసుగులో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాక్షాత్తు దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలను సైతం బేఖాతరు చేయడంతో, రెండు ప్రభుత్వ శాఖల నుండి నోటీసులు రావడంగమనార్హం.తమ తప్పులనుకప్పిపుచ్చుకోవడానికి,ఈ నోటీసులకు సమాధానంగా భారీ మొత్తంలో అపరాధ రుసుములను చెల్లిస్తూ, చేసిన తప్పిదాలను ఒప్పులుగా మార్చుకునే వైనం విస్మయానికి గురిచేస్తోంది. అయితే, అధికారి చేసిన ఈ స్వయంకృత అపరాధాలకు భక్తులు సమర్పించిన సొమ్ములు బలికావాలా?అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

**విశ్వనాధ రాజు తప్పు.. భక్తుల కానుకలు కర్పూరం..**

తల్లీ తలుపులమ్మ ప్రసాదం తూకంలో జరిగిన మోసం ఆధారాలతో సహా లీగల్ మెట్రోలజీ అధికారులకు చిక్కింది.

ఈ నిర్లక్ష్యానికి బాధ్యత వహించాల్సిన ఈవో పి.విశ్వనాధరాజు, తన వ్యక్తిగత వైఫల్యం వల్ల పడిన 15,000/- రూపాయలఅపరాధ రుసుమును భక్తులు సమర్పించిన అమ్మవారి నిధుల నుండి చెల్లించడం అత్యంత అమానుషం.అధికారి చేసినతప్పిదానికి భక్తుల కానుకలను వాడటం ఆలయప్రతిష్టను మంటగలపడమే.

**మత్తులో సిబ్బంది - మద్యం బాటిళ్ల తాండవం**

ఒకవైపు పూజారులు కఠిన దీక్షలతో అమ్మవారి సేవలో తరిస్తుంటే, మరోవైపు ఈవోపర్యవేక్షణలేని సిబ్బంది మద్యం మత్తులో తూగుతున్నారు. పవిత్రమైన సత్రాలు, భక్తులు విశ్రాంతి తీసుకోవాల్సిన గదులు నేడు మద్యం బాటిళ్లకు నిలయాలుగా మారాయి. పవిత్ర క్షేత్రంలో మద్యం తాగడానికి రూములు ఇవ్వవచ్చని కమిషనర్ గారు ఏమైనా ప్రత్యేక అనుమతి ఇచ్చారా? లేక విశ్వనాధరాజు గారే తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి సిబ్బందికి ఈ 'కిక్కు' ఇస్తున్నారా?

**అధిక ధరలతో భక్తుల దోపిడీ:**క్షేత్రంలో అడుగడుగునా భక్తుల జేబులకు చిల్లు పడుతోంది. కొబ్బరికాయలు, అమ్మవారి చీర, పసుపు, కుంకుమ, గాజులు వంటి నిత్య అవసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉన్నాయి. ఇక తాగునీరు, శీతల పానీయాల బాటిళ్లను గరిష్ట విక్రయ ధర కంటే రూ.10 ఎక్కువగా అమ్ముతున్నా పట్టించుకునే నాథుడే లేడు. షాపుల కేటాయింపు సైతం నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారీతిన జరిగినట్లుగా స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ దోపిడీ వెనుక ఎవరి హస్తం ఉందో విచారణ జరగాల్సి ఉంది.

**అవినీతి అష్టభుజి.. అదుపు తప్పిన అభివృద్ధి..**

**ఆడిట్ విభాగం అండదండలు!**

లోవ పుణ్యక్షేత్రంలో కార్యనిర్వహణాధికారి పి.విశ్వనాధరాజు సాగిస్తున్న అవినీతి అష్టభుజి క్రీడకు అంతులేకుండా పోతోంది. గత కొన్నేళ్లుగా ఇక్కడే పాతుకుపోయిన ఈ అధికారి, వ్యవస్థలన్నింటినీ తన అవినీతి జాలంతో అల్లేశారని అమ్మవారి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర అభివృద్ధి పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించి చేపడుతున్న పనుల్లో కనీస నాణ్యత లేదని, అటు ప్రసాదాల విక్రయాల్లో సైతం లెక్కల్లో తేడాలు చూపిస్తూ భారీగా సొమ్ము దారి మళ్లిస్తున్నారని, ఇలా ప్రతి విభాగంలోనూ అవినీతి చోటుచేసుకుందనిభక్తులు మొరపెట్టుకుంటు న్నారు. రాష్ట్ర తనిఖీ విభాగం అధికారులు ఈ అక్రమాలను పసిగట్టడంలో విఫలమైనా, భక్తుల ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగుతున్న కేంద్ర గణాంక తనిఖీ విభాగం అనగా ఏజీ ఆడిట్ రాకతో అవినీతి ఊడలు మొత్తం విరిగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే తూనికలు, ఆహార భద్రతా విభాగాల తనిఖీలతో అమ్మవారి ప్రసాదం నాణ్యత పెరిగి, తూకం కచ్చితంగా వచ్చేలా మార్పు జరిగినప్పటికీ, గడిచిన కాలంలో జరిగిన కోట్ల రూపాయలఅవినీతి మాత్రంఈకేంద్రబృందం విచారణతోనే పూర్తిగా వెలుగులోకి రానుంది. ఈ 'విశ్వనాధ లీలల' అంతం కేంద్రఅధికారుల తనిఖీతోనే మొదలవుతుందని భక్తులు ఆశిస్తున్నారు.

**ఆలయం రాతి కట్టడం కాదు!**

కంచి పరమాచార్యుల వంటి మహానుభావులు చెప్పినట్లుగా.. ఆలయం అంటే కేవలం రాతికట్టడంకాదు,అదిఅది భక్తుల నమ్మకానికి ప్రతి రూపం. అటువంటి ఆలయంలో మద్యం మత్తులో ఊగడం, తూకంలో మోసం చేయడం సాక్షాత్తూ ఆ పరమాత్మకే చేసే ద్రోహం. ఈవో పి.విశ్వనాధ రాజు చేసే ప్రతి అక్రమం ఆతల్లి కళ్ళముందే జరుగుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అమ్మవారి సొమ్మును అపరాధ రుసుముగా కట్టడం కంటే ఘోరం మరొకటి ఉండదు.

**భక్తుల డిమాండ్..**అమ్మవారి మహిమ అపారం, కానీ ఈవో విశ్వనాధ రాజు అక్రమాలు అంతులేనివిగా మారాయి. ఇప్పటికైనా దేవాదాయ శాఖ కమిషనర్ స్పందించి, ఈ 'అవినీతి అక్టోపస్' నుంచి తలంపులమ్మ క్షేత్రాన్ని కాపాడాలి. నిర్లక్ష్యం వహించిన అధికారులను వెంటనే బదిలీ చేసి, పవిత్రతను పునరుద్ధరించాలని భక్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# జనసేన పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం

- సభ్యత్వ నమోదును 'సాధక్'లు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి
- కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పిలుపు



**కాకినాడ,మేజర్న్యూస్ :** పార్టీ సభ్యత్వంతో నాయకులకు గుర్తింపు, గౌరవంతో పాటు భీమా సౌకర్యం కల్పిస్తున్న ఏకైక పార్టీ జనసేన పార్టీ మాత్రమేనని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, 'సాధక్' లతో సమావేశమై నియోజకవర్గంలో పార్టీ సభ్యత నమోదుపై చర్చించారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరైన సాధక్ లను ఉద్దేశించి ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 26 నుండి మొదలైన సభ్యత నమోదు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుందన్నారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు ఆకర్షితులై రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల నుండి అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. కాకినాడ సిటీ పార్టీ కార్యకర్తలు, నాయకులు మరింత ఉత్సాహంగా సభ్యత నమోదులో పాల్గొని రాష్ట్రంలోనే అగ్రగా మిగా నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాధక్లు ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ సిద్ధాంతం వివరించి సభ్యత్వ నమోదులో భాగస్వా మ్యం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తలాటం సత్య, అడబాల సత్యనారాయణ, మచ్చ గంగాధర్, డా. రజిని, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకినాడ 'సీజన్స్ 5'లో తనిఖీల కలకలం

మొదటిపేజి తరువాయి

**డీ-ఫ్రిజ్లో నిల్వ మాంసం.. సీజ్ చేసిన అధికారులు**

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రసాద్ కిచెన్లోకి వెళ్లగానే విస్తుపోయే దృశ్యాలు కనిపించాయి.తాజామాంసం వాడుతున్నామని నమ్మబలికే యాజ మాన్యం, డీ-ఫ్రిజ్లో ఎప్పుడో నిల్వ ఉంచిన చికెన్ను సిద్ధం చేసి ఉంచింది. ఇందులో పచ్చి మాంసం నిల్వ ఉంచుటంతో పాటు టేస్టింగ్ సాల్ట్ ను సీజ్ చేయడం జరిగింది, అదే విధంగా తయారైన మాంసాన్ని ఫ్రిజ్లో ఉంచారు.దాన్నికూడా సీజ్ చేసి శాంపిల్కి సేకరించి ల్యాబ్లకు పంపడం జరిగింది. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా ఈ రెస్టారెంట్పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎఫ్ఎస్ఓ ప్రసాద్ తెలియజేశారు. కిచెన్ వాతావరణంమరింతహైజినిక్గా ఉండాలని అధికారులు ఆదేశించారు.

**డీఎస్ఓ సత్యనారాయణరాజు హెచ్చరిక**

రుచి ఉందని వస్తున్న వినియోగదారులకు నాణ్యతలేని నిల్వ మాంసంతో తయారైనవాటిని అందిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. అన్ని శాఖల అధికారులు ఏకకాలంలో దాడులు చేయడం జరిగిందని, హోటళ్లను హైజనిక్ వాతావరణంలో ఉంచుతూ ఏ రోజు చికెన్ ఆరోజే కొని తయారు చేయాలని, నాణ్యత లేని వంటకాలు తయారు చేస్తే సహించేది లేదని డీఎస్ఓ సత్యనారాయణరాజు హెచ్చరించారు.

**అపరిశుభ్రతపై నిఘా**

- డ్రైనేజీ అధ్వాన్నం: హోటల్ నుంచి వెళ్లే వ్యర్థాలు కాలువలో సరిగ్గా కలవకుండా హైజనిక్వాతావరణం దెబ్బతినడంపై శానిటరీ ఇన్స్పెక్టర్లు మండిపారు.

- ముమ్మర తనిఖీలు: వాణిజ్య పన్నుల శాఖ అధికారులు హోటల్ రికార్డులను,గ్యాస్ వినియోగ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

'స్మార్ట్' సిటీలో 'సేఫ్' ఫుడ్ ఎక్కడ?

కాకినాడ నగరంలో పేరున్న హోటళ్ల పరిస్థితే ఇలా ఉంటే, చిన్న చిన్న హోటళ్ల పరిస్థితి ఏంటని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. సీజన్స్ 5లో దొరికిన నిల్వ మాంసం, పన్ను ఎగవేత అనుమానాలు నగరంలోని ఇతర హోటళ్లపై కూడా అధికారుల నిఘా పెంచేలా చేశాయి.

## భూ సమస్యలు పరిష్కారానికి చర్యలు

**- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పోలవరం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సమస్యలు, భూ సమస్యలు, కొత్త డి-పట్టాలు సమస్యలు, భూ సేకరణ, వెబ్ లాండ్ సమస్యలకు సంబంధించి కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించిన వాటిని పరిష్కరించే విధంగా పోలవరం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లా (రంపచోడవరం) లో రెవెన్యూ శాఖకు సంబంధించి 29 దరఖాస్తులు రావడం జరిగిందని తెలిపారు. ప్రతీ దరఖాస్తు జిల్లాలోని ఆయా మండలాల తాసిల్దారులకు పంపించి నిబంధనలు ప్రకారం సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతివారం రెవెన్యూ శాఖకు వచ్చిన సమస్యల దరఖాస్తులు ఎన్ని పరిష్కరించినవి, ఇంకా ఎన్ని దరఖాస్తులు పరిష్కరించవలసి ఉన్నది సంబంధిత అధికారులతో సంప్రదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రెవిన్యూ శాఖలో రెవెన్యూ రికార్డులలో భూ సమస్యలకు సంబంధించిన రికార్డులన్నీ పరిశీలించి దరఖాస్తుదారుని సమస్య పరిష్కరించినది లేనిది, అదేవిధంగా పరిష్కారం కాకపోతే ఎందుకు పరిష్కారం కాలేదో నివేదికలు ద్వారా తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఐటీడీఏ ఎపిఓ జనరల్ డి.ఎన్.వి.రమణ, తహసిల్దార్లు పి.బాలాజీ, కరక సత్యనారాయణ, ఏ.సత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాసరావు, దొర కయ్య, వేణుగోపాల్, అమ్మాజీ, సాయద్ చందు, ధర్మేంద్ర కుమార్, సరస్వతి, శ్రీనివాసరావు, బ్రహ్మాజీ, డిప్యూటీ తహసిల్దార్లు సరిత, శ్రీధర్, శివ, జనార్ధన్, సాంబశివరావు, విలేజ్ రెవెన్యూ అధికారులు సిహెచ్ రవికుమార్, సత్యనారాయణ, శివకుమార్, బత్తుల ప్రభావతి పాల్గొన్నారు.

# బాణాసంచా పేలుడు ప్రమాదంలో 23 మంది మృతిచెందడం దురదృష్టకరం

**- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం వేట్లపాలెం బాణా సంచా పేలుడు ప్రమాదంలో 23 మంది మృతిచెందడం హృదయ విధారకరమైన దురదృష్టకరమైన సంఘటనని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. సోమవారం సామర్లకోట కుమ్మరి వీధి ప్రాంతంలో బాణా సంచా ప్రమాద ఘటనలో మృతి చెందిన దర్శిపాటి నాని, దర్శిపాటి పెద లోవరాజు, దర్శిపాటి రాజు, ఏడిద సామ్యూల్ కుటుంబాలను పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబుతో కలిసి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రా యిల్ మాట్లాడుతూ వేట్లపాలెం ఘటనలో అమాయకులు మృతి చెందడం వారి కుటుంబాలు నిరాశ్రయులు కావడం దురదృష్టకరం సంఘటనని, మృతుల కుటుంబాలకు వైఎస్ఆర్సిపి పార్టీ అండగా ఉంటుందన్నారు. బాణాసంచా కేంద్ర నిర్వాహకుడు అడబాల నాని ధనాపేక్ష కారణంగానే సుమారు 23 మంది ప్రాణాలు పోవడానికి కారణమని, ఈ సంఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదని ఆయన అన్నారు. ప్రభుత్వంలో పని చేస్తున్న అధికారులు గ్రౌండ్ లెవెల్లో పర్యవేక్షణ లేకపోవడం వలన 20 మంది పనిచేయడానికి ఇచ్చిన లైసెన్స్ బాణాసంచా దుకాణంలో సుమారు 80 నుంచి 100 మంది వరకు యజమాని పని చేయించడం జరుగుతుందని అన్నారు. ప్రమాద ఘటనలో అత్యధికంగా దళితులు, బీసీలు ఉన్నారన్నారు. సుమారు మూడు నెలలు ముందు ఇటువంటి ఘటన మండపేట నియోజకవర్గం రాయవరంలో చోటు చేసుకుందని, గతంలో సైతం వేట్లపాలెంలో ఇటువంటి ప్రమాదాలు జరిగాయన్నారు. ఇటువంటి సంఘటనలు వరసుగా జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వలన పెద్ద ఎత్తున అమాయకులు మృత్యువాత పడ్డారని అన్నారు. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిధేనని ఎమ్మెల్సీ విమర్శించారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం 20 లక్షల రూపాయలు చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని, నిరాశ్రేయులైన వీరికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్రేషియా, ప్రతి కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పక్కా ఇల్లు నిర్మించాలని, మృతుల కుటుంబాలకు 5 ఎకరాల భూమిని కేటాయించాలని వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీలతో పరామర్శించిన వారిలో సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజేష్, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్,వైసిపి నాయకులు తదితరులు ఉన్నారు.

# ప్రతీ వ్యక్తి చదవడం, రాయడం నేర్చుకోవాలి

**- అక్షర ఆంధ్ర కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్**



**రంపచోడవరం,మేజర్న్యూస్ :** రాష్ట్రంలో 15 సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి చదవడం రాయడం నేర్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందని పోలవరం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ సమీపంలోని మండల పరిషత్ పాఠశాలలో అక్షర ఆంధ్ర కేంద్రాన్ని పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామాలతో సైతం 15 సంవత్సరాలు దాటిన నిర్లక్ష్యరాశ్యులైన ప్రతి వ్యక్తి చదవడం రాయడం సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులతో చదువు నేర్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. 2029 నాటికి అక్షరాస్యత ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ అక్షర ఆంధ్ర కార్యక్రమం సచివాలయాల స్థాయిలో వాలంటీర్ల ద్వారా చదవడం రాయడం పై అవగాహన కల్పించి చదువు నేర్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. పదిమందికి ఒక వాలంటరీతో చదువు నేర్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. గత మూడు నెలల నుండి అక్షర ఆంధ్ర ద్వారా అక్షరాస్యత ను తీర్చిదిద్దే విధంగా ఎక్కడికక్కడ చదువు రానివారికి చదవడం రాయడం నేర్పించడం జరుగుతుందని అదేవిధంగా ఈ క్లాసులకు చదువుపై మక్కువ ఉన్నవారు ఏ టైంలో నైనా పాఠశాలలకు వచ్చి చదువు నేర్చుకోవచ్చని అదేవిధంగా ఈనెల 2వ 5వ, 10వ తారీకులలో రెగ్యులర్ ఉపాధ్యాయులతో స్కూలు పని దినములలో చదువు నేర్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం అక్షరాక్షత ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ ఏపీవో నోడల్ అధికారి త్రిమూర్తులు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఏపియం శ్రీరాములు, ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "ఏఐ టూల్స్పై వర్క్ షాప్"




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ డా. దేవరపల్లి చెన్నారావు ఆధ్వర్యంలో ఐక్యూ ఏసీ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్, సైన్స్ విభాగాలు " ఏఐ టూల్స్పై " పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. మార్గదర్శకాల ప్రకారం మొదటి సంవత్సరం విద్యార్థులందరిక చా× ను ఒక నైపుణ్య కోర్సుగా ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ వర్క్ షాప్ మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డా.డి. చెన్నారావు ప్రారంభించి, నేటి సమాజంలో కృత్రిమ మేధస్సు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాలో చా× వినియోగం రోజురోజుకు పెరుగుతున్నదని, విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ వర్క్ షాప్ ముఖ్య వక్తగా రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ లెక్చరర్ ఎమ్.శివ కుమారి పాల్గొన్నారు. ఆమె కృత్రిమ మేధస్సు యొక్క మూలాధారాలు, దాని వినియోగాలు మరియు ప్రస్తుత కాలంలో ఉపయోగంలో ఉన్న వివిధ చా× టూల్స్ గురించి సమగ్రంగా వివరిస్తూ జీవశాస్త్ర విద్యార్థులకు డేటా విశ్లేషణ, పరిశోధన మరియు జన్యు సమాచార అధ్యయనంలో, గణిత విద్యార్థులకు సంక్లిష్ట సమస్యల పరిష్కారంలో, రసాయన శాస్త్ర విద్యార్థులకు అణు నిర్మాణ విశ్లేషణలో, రాజనీతి శాస్త్ర విద్యార్థులకు డేటా ఆధారిత సమీక్షలు మరియు విధానాల విశ్లేషణలో, వాణిజ్య విద్యార్థులకు మార్కెట్ విశ్లేషణ, ఆర్థిక అంచనాలు మరియు అకౌంటింగ్ ఆటోమేషన్లో చా× టూల్స్ విస్తృతంగా సహాయపడతాయని తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యక్ష ప్రాక్టికల్ సెషన్ నిర్వహించి, వివిధ చా× టూల్స్ను ఉపయోగించే విధానాన్ని చూపించారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ ఆద్యాపకులు వి. దేవి ప్రసన్న సమన్వయ కర్తగా వ్యవహరించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక అవగాహన పెంపొంద డంతో పాటు, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగిందని విద్యార్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సి. హెచ్. బాలరాజు , కెమిస్ట్రీ ఆధ్యాపకులు వి.మల్లికార్జున శర్మ, కామర్స్ ఆద్యాపకులు డా.జి. సురేష్, కె. వెంకట రావు , జువాలజీ అధ్యాపకులు పి. శ్రీనివాసరావు, హిస్టరీ ఆద్యాపకులు ఆర్.శ్రీను, ఇతర అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఛండీహెూమంలో పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు సోమవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి పౌర్ణమి సందర్భంగా ఛండీహెూమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.


## పేరు మార్పు ప్రకటన

నేను బేబి బండారు W/o బండారు శ్రీరామచంద్రమూర్తి
డోరు నెం.3-94, మునసేబు గారి వీధి,
వాడపాలెం గ్రామం, కొత్తపేట మండలం,
డా॥బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమజిల్లా
చిరునామాలో నివసిస్తున్నాను.యావన్మందికి తెలియచేయునది
ఏమనగా| ఇకపై నా పేరును బండారు అనంతలక్ష్మీ
సత్యవతిదేవి గా పిలవవలసిందిగా అందరికి తెలియజేస్తున్నాను.

**పాత పేరు:** బేబి బండారు

**కొత్త పేరు:** బండారు అనంత లక్ష్మి సత్యవతిదేవి

చిరునామా: డోరు నెం.3-94, మునసేబు గారి వీధి,
వాడపాలెం గ్రామం, కొత్తపేట మండలం,
డా॥బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమజిల్లా
సెల్: 9493068444

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# అమెరికా సామ్రాజ్యవాది దురహంకారాన్ని, యుద్ధోన్మాదాన్ని ఖండించండి

**– ఏపీ ఆర్ సి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు**




**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కలిసి దాడి చేయడాన్ని ఖండిస్తూ ఆంధ్ర ప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రం జగ్గంపేట శివారు, రంగవల్లి నగర్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏపీఆర్ సి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ ఇరాన్ ప్రజల పైన, ఆ దేశ సుప్రీం ఖమేని నివాస భవన్ పై దాడి చేసి హత్య చేయడం, పాఠశాలలపై బాంబులు వేసి, పిల్లల్ని సహితం చంపడం సామ్రాజ్యవాద దురహంకారానికి పరాకాష్టని అన్నారు. ఈ దాడులు ఇరాన్ దేశ సార్వభౌమ అధికారాన్ని, ఐక్యరాజ్యసమితి నిబంధన వళిని, అన్ని అంతర్జాతీయ ఒప్పందాలను దారుణంగా ఉల్లంఘించడమేనని విమర్శించారు. ఇటీవల వెనుజుల అధ్యక్షుడు మధురోను, ఆయన భార్యను సొంత నివాసం నుండే కిడ్నాప్ చేసి అమెరికాలో నిర్భంధించారని గుర్తు చేశారు. వెనుజుల ఆయిల్ వనరులపై ఆధిపత్యం తమదేనని ట్రంపు ప్రకటించడం ద్వారా తన అసలు స్వరూపం బయటపెట్టాడన్నారు. క్యూబా దేశం పై కూడా అమెరికా బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. గాజా పై దాడులు చేసి నరమేధం సృష్టించిన, ఇజ్రాయిల్ శాంతి ఒప్పందం కుదిరిందని ప్రకటించాక కూడా గాజా పై దాడులు ఆపలేదన్నారు. ఇరాన్ పై దాడి అసలు లక్ష్యం గల్ఫ్ లో ఉన్న సహజ వనరులు అన్నింటిని స్వాధీనం చేసుకోవడమేనని వెల్లడించారు. అమెరికన్ సామ్రాజ్యవాదం చేసిన దురాగాతల ఫలితంగానే ఉగ్రవాద సంస్థలు పుట్టాయని నేడు వాటిని సాకుగా చూపి వివిధ దేశాలపై దాడులు చేస్తున్నారని అన్నారు. ఆయా దేశాల వనరులను కాపాడుకునేందుకు తమకు తోచిన రీతిలో పోరాడుతున్న ప్రభుత్వాలను అమెరికా బలవంతంగా లొంగ దీసుకుంటుందని పేర్కొన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని భారత ప్రభుత్వం ఖండించాలని ప్రధానమంత్రి మోడీని డిమాండ్ చేశారు. ప్రపంచ శాంతి కోసం భారత్ ప్రజలు ఈ దాడులను ఖండించాలని, సామ్రాజ్యవాద దురాహంకార, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగవల్లి నగర్ నాయకులు దాన్ శ్రీను, సోమరాజు, లక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మొండెం లేని మహిళ తల భాగం

**– సక్కుమళ్ళ రాఘవగా గుర్తింపు**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో సంభవించిన బాణాసంచా పేలుడు దుర్ఘటనలో సోమవారం సాయంత్రం పంట పొలంలో లభించిన మొండెం లేని మహిళ తలభాగం మహిళ కార్మికురాలు సక్కుపల్లి రాఘవ(50) దిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పెద్దాపురం డిఎస్పి డి.శ్రీహరి రాజు సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రమాదంలో ఇదివరకు మృతుల జాబితాలో ఉన్న సక్కుమళ్ళ రాఘవకు సంబంధించిన పూర్తి అవయవాలు పంచనామా సమయంలో లభించలేదన్నారు. గత రెండు రోజులుగా గాలింపు, డ్రోన్ సహాయంతో చేపట్టిన గాలింపులో భాగంగా ఆమె తలభాగం గుర్తించినట్టు డీఎస్పీ తెలిపారు. కుటుంబీకుల నిర్ధారణతో ప్రస్తుతానికి అవయవ భాగాన్ని జగ్గంపేట తహసీల్దార్ ఆధ్వర్యంలో పంచనామా అనంతరం కుటుంబానికి అందించామన్నారు. అయితే డిఎన్ఏ పరీక్షలు జరిపి మరోసారి నిర్ధారణ చేరుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాగా వేట్లపాలెం సంఘటనా స్థలం వద్ద పోలీస్ పికెట్ అమల్లో ఉందని ప్రజలు ఎవరైనా ప్రమాదానికి సంబంధించి వివరాలు తెలియపరిచేందుకు సామర్లకోట పోలీస్ స్టేషన్లో గాని, పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో గాని, అధికారులకు కానీ సమాచారం అందించాలన్నారు.

## వేట్లపాలెం మృతుల కుటుంబాలకు మందకృష్ణ పరామర్శ



సామర్లకోట, మేజర్ న్యూస్ : వేట్లపాలెం పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. మందకృష్ణ మాదిగా సోమవారం సాయంత్రం పరామర్శించారు. సామర్లకోట పట్టణంలోని కుమ్మరివీధి, వేట్లపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి మృతుల కుటుంబాలను కలిసి వారికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్భంగా ప్రమాధానికి గల కారణాలపై విచారణ జరిపారు. కుటుంబాలకు అండగా నిలువనున్నట్టు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మందకృష్ణ వెంట స్థానిక తెదేపా నాయకులు తాతపూడి కృష్ణబాబు, కాపవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేట్లపాలెం బాణసంచా ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలి

**– జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్**

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** వేట్లపాలెం బాణసంచా ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలి జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండలం వేట్లపాలెంలో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రవణ్ కుమార్ పరిశీలించారు మీడియాతో మాట్లాడుతూ కూటమికి ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ఈనాడు పత్రికలో ప్రచురించిన లైసెన్సులు లేకుండా నడుపుతున్నటువంటి పలు మందు గుళ్ళు సామాగ్రి తయారీ కేంద్రాలకు సంబంధించిన విషయాలను మరియు పట్టి పట్టినట్టు వ్యవహరిస్తున్న అధికారులకు సంబంధించిన విషయాలను చదివి మీడియాకు వినిపించారు. ఈ యొక్క సంఘటనకు పూర్తి బాధ్యత కలెక్టర్ మరియు ఎస్పీలు వహించాలని వారిని సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా కోరారు. భాధితులకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని దీనిలో ఎస్సీలకు భూమి ఉద్యోగం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు సిద్ధాంతుల కొండబాబు, లింగం శివ, బొబ్బరాడ సత్తిబాబు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 1 అర్జీ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కె.శ్రీరమణి సూచనల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి ఒక అర్జీ వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ డిప్యూటి తహశీల్దార్ ఎం.వి.భానుకుమార్ తెలిపారు. ఈ అర్జీను త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటి తహశీల్దార్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఏ దైవకుమార్, హౌసింగ్ ఏఇ రవిశంకర్, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజవొమ్మంగిలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ




**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో సోమవారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఎస్సై శివకుమార్ నేతృత్వంలో జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినులు తో స్థానిక గాంధీ సెంటర్ నుండి అల్లూరు జంక్షన్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. బాలికలు చదువుపై శ్రద్ధ వహించి బాల్యవివాహాలు బహిష్కరించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తే ప్రపంచమే బలమైన శక్తిగా మారుతుందని సిఐ గౌరీ శంకర్ అన్నారు. ఈ మేరకు అల్లూరి జంక్షన్ వద్ద మానవహారం ఏర్పడి మహిళా సాధికారత, అలానే మహిళల హక్కుల గురించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అగ్ని బాధితులకు అండగా ముద్రగడ గిరిబాబు

**– తక్షణ సహాయం, ప్రభుత్వానికి డిమాండ్**



**శంఖవరం, మేజర్ న్యూస్ :** మండలంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్నిప్రమాదాల వల్ల ఐదు కుటుంబాలు నివాసం కోల్పోయిన నేపథ్యంలో ప్రతిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు గ్రామాలను సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పి తక్షణ సహాయాన్ని అందించారు. మండలంలోని ఆవేల్తి గ్రామంలో ఒక తాటాకు ఇల్లు, గొంది కొత్తపల్లి గ్రామంలో నాలుగు తాటాకు ఇళ్లు అగ్నికి ఆహుతి కావడంతో ఐదు కుటుంబాలు నిలువనీడ కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే గిరిబాబు సంఘటన స్థలాలకు చేరుకుని బాధిత కుటుంబాల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి బట్టలు, బియ్యం మరియు ఆర్థిక సహాయం అందజేశారు. బాధితులతో మాట్లాడిన గిరిబాబు, “మీరు ఎలాంటి ఆందోళన చెందవద్దు. పార్టీ తరపున ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటాం” అని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో కోల్పోయిన ఆస్తి, వస్తువులపై అధికారులతో చర్చించి తక్షణమే ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో తాటాకు ఇళ్లు కలిగిన వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొంటూ, గుడిసెలపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను వెంటనే సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. గ్రామస్తులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవ ర్గంలో ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగిన వెంటనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఇళ్లు నిర్మించేందుకు ప్రత్యేక పథకాల కింద సాయం అందించాలని గిరిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నరాల శ్రీనివాస్, వైసీపీ నాయకులు పండు, రవి,ఈగల అప్పారావు ఈగల గంగా సతీష్ తదితరులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమర జవాన్ నాగబాబుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఘన నివాళి

**– గ్రామ కూడలిలో నాగబాబు విగ్రహం ఏర్పాటుకు చర్యలు**



**అల్లవరం, మేజర్ న్యూస్ :** దేశ రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అమర జవాన్ బడుగు నాగబాబు సేవలు చిరస్మరణీయమని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ కొనియాడారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన నాగబాబు ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామంలో నిర్వహించిన నాగబాబు సంతాప సభకు ఎంపీ హరీష్ మాధుర్ విచ్చేసి, జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగబాబు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సుమారు 24 ఏళ్ల పాటు భారత సైన్యంలో వివిధ హోదాల్లో దేశానికి సేవలందించిన నాగబాబు మృతి చెందడం కోనసీమ ప్రాంతానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాడే సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నాగబాబు కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో, దేశానికి సుదీర్ఘ కాలం సేవలందించిన జవాన్‌కు అంత్యక్రియల సమయంలో దక్కాల్సిన అధికార లాంఛనాలు, గౌరవ వందనం విషయంలో జరిగిన జాప్యంపై ఎంపీ హరీష్ మాధుర్ అసహనం వ్యక్తం చేశారు. సైనికుల పట్ల గౌరవం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఆర్మీ జవాన్ బడుగు నాగబాబు మృతికి సంతాపం తెలియజేస్తూ పోలీసులు గౌరవ వందనంతో పాటు కుటుంబ సభ్యులకు ఆర్మీ అధికారులు జాతీయ జెండా అందజేశారు. రాజస్థాన్ 27 ఎడి ఎంఎస్ఎల్ ఆర్ఈజిటి నుండి సుబేదార్ వై.వి.రావు, హవల్దార్ వి.కే.కుమార్ పెచ్చెట్టి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్, గ్రామ సర్పంచ్ రొక్కల విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, దాక వరపు చిరంజీవి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, సాధనాల శ్రీనివాస్, సాపే ధర్మరాజు, జల్లి రాధాకృష్ణ, మొయిల గణపతి, ముత్యాల బాబి, రొక్కల నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జెఎన్టీయుకెలో

# 'రెగ్యులేటరీ అండ్ లీగల్ మేనేజ్‌మెంట్ ఫర్ బిజినెస్ ప్రొఫెషనల్స్'

**– ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో సోమవారం మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ (వీశీమీవీజు) ప్రాయోజకత్వంలో "రెగ్యులేటరీ అండ్ లీగల్ మేనేజ్‌మెంట్ ఫర్ బిజినెస్ ప్రొఫెషనల్స్" ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. వర్క్‌షాప్ నోడల్ అధికారి మరియు విభాగాధిపతి డా.కె.మీరాసాహెబ్ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓఎన్ జీసీ రిటైర్డ్ జనరల్ మేనేజర్ పి.ఆర్.కె.రాజు మరియు అడ్వకేట్ పి.వి. సుబ్బారావు హాజరయ్యారు. గౌరవ అతిథిగా యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మరాజు పాల్గొన్నారు. విభాగాధిపతి మరియు కార్యక్రమ నోడల్ అధికారి డా. కె.మీరా సాహెబ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం లక్ష్యాలు మరియు ప్రాధాన్యతను వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం విభాగం లక్ష్యమని పేర్కొన్నారు. పి.ఆర్.కె. రాజు మానవ వనరుల అభివృద్ధి రంగంలో ఇటీవల అమల్లోకి వచ్చిన నూతన చట్టాలు మరియు విధానాలపై సమగ్రంగా వివరించారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు మరియు హెచ్‌ఆర్ విభాగం పాత్రను ప్రామాణిక ఉదాహరణలతో వివరిస్తూ పాల్గొన్నవారికి స్పష్టమైన అవగాహన కల్పించారు. పి.వి.సుబ్బారావు కార్మిక చట్టాలు, వినియోగ దారుల హక్కుల చట్టాలు, ఉద్యోగుల సంక్షేమ చట్టాలు మరియు ఇండస్ట్రియల్ రిలేషన్స్ అంశాలపై ముఖ్యాంశాలను సంక్షిప్తంగా వివరించారు. ప్రస్తుత వ్యాపార వాతావరణంలో చట్టపరమైన అవగాహన అత్యంత అవసరమని ఆయన సూచించారు. యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడుతూ, భారత ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల పాత్రను ప్రాముఖ్యతతో వివరించారు. పారిశ్రామి కవేత్తలకు లభిస్తున్న అవకాశాలను ప్రస్తావిస్తూ, విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా వ్యాపార సృష్టి దిశగా ఆలోచించాలని సూచించారు. యువత స్టార్టప్‌లను ప్రోత్సహించి "వికసిత్ భారత్" మరియు "మేక్ ఇన్ ఇండియా" లక్ష్యాలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, విద్యార్థులు మరియు పరిశ్రమ నిపుణులు హాజరయ్యారు.

# గ్రామపంచాయతీకి మహాప్రస్థానం వ్యాన్ బహుకరణ



జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు, శ్రీ స్నేహ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పాలకుర్తి సురేష్ జగ్గంపేట గ్రామపంచాయతీకి రూ 10 లక్షలతో మహాప్రస్థావన వ్యాన్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించి జగ్గంపేట గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పాలకుర్తి సురేష్ దంపతులు ఒక పుణ్యకార్యం చేపట్టారని పుట్టిన ప్రతి ఒక్కరూ మరణించక తప్పదని చివరి మజిలీ మహా ప్రస్థానానికి తీసుకువెళ్లే ఒక రథాన్ని జగ్గంపేట గ్రామపంచాయతీకీ అందజేయడం చాలా మంచి కార్యక్రమాన్ని చేపట్టిన సురేష్ దంపతులను అభినందించారు. రాజమండ్రి గోదావరి తీరానికి తీసుకెళ్లడానికి బాగా ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం జగ్గంపేట మండల పరిషత్ వారి ఆధ్వర్యంలో స్వచ్ఛరథం ప్రారంభించారు. మండలంలోని గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ పనికిరాని వస్తువులను తీసుకుని పనికొచ్చే నిత్యవసర వస్తువులు అందజేసి గ్రామాల పరిశుభ్రతకు ఎంతగానో ఈ స్వచ్ఛ రథలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీఎస్. అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, ఎండిఓ చంద్రశేఖర్, ఆయిల్ స్వామి, నండ్ల చిరంజీవి, మానేపల్లి బంగార్రాజు, రాయి సాయి, కోడూరి సత్యనారాయణ, ఎస్ వి ప్రసాద్, నాగిరెడ్డి సాయికృష్ణ, పంచాయతీ సెక్రెటరీ శివ, మానేపల్లి సాయి, బోండా సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ నగర్ కాలనీలో ముత్యాలమ్మ తృతీయ జాతర మహోత్సవాలు

**– ఆలయ ధర్మకర్త, టిడిపి గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పంతాడి అంజి**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీరామ్ నగర్ కాలనీలో 25 సంవత్సరాలుగా కొలువైయున్న శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి తృతీయ జాతర మహోత్సవాలు మార్చి 17 నుండి 19 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, టిడిపి పురుషోత్తపట్నం గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పంతాడి అంజి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీన ముత్యాలమ్మ అమ్మవారికి మంగళ స్నానం నిర్వహిస్తామని, 18వ తేదీన బోనాల సమర్పణ ఉంటుందని, 19వ తేదీన అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఊరేగింపునాడు హైదరాబాద్ వారి బోనాల డాన్స్, రాజమండ్రి వారిచే అఘోరా డాన్స్, అమలాపురం వారిచే కాళీమాత డాన్స్, విజయవాడ వారిచే తీన్మార్ తదితర కళారూపాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతర మహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ ధర్మకర్త పంతాడి అంజి పేర్కొన్నారు.

## మున్సిపల్ పిజిఆర్‌ఎస్‌కు మూడు అర్జీలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సోమవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమానికి మూడు అర్జీలు వచ్చినట్లు డిఇ కె.రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, జి.ఎస్.డబ్ల్యూ.ఎస్. మేనేజర్ ప్రసాద్, వెంకటలక్ష్మీ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ స్కూల్‌కు ఎంపికైన శ్రీ ఆర్కా విద్యార్థి

**– అభినందించిన ఛైర్మన్ మరియు ప్రిన్సిపాల్**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో స్థానిక సుధాకాలనీలో ప్రముఖ విద్యా సంస్థ శ్రీ ఆర్కా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి బి.వి.ఎస్.రిత్విక్ సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు స్కూల్ ఛైర్మన్ అరుణ్ రామ నాగేంద్రన్, ప్రిన్సిపల్ జోష్న అచ్యుత లు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 6వ తరగతి ప్రవేశ పరీక్షలో రిత్విక్ అర్హత సాధించడాడని తెలిపారు. ఈ సందర్భంగా రిత్విక్‌ను ఛైర్మన్ మరియు ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించినవారిలో ఉన్నారు.

# 'ఆదిత్య'లో నిర్వాహణ్-2కె26



కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తమ కళాశాలకు చెందిన విద్యార్థినిలు పి.వి.ఆర్. ట్రస్ట్ డిగ్రీ కళాశాల వారు నిర్వహించిన కామర్స్ & మేనేజ్‌మెంట్ ఫెస్ట్ నిర్వాహణ్-2కె26 లో విజేతలుగా నిలిచారని తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సులు చాలానే ఉన్నప్పటికీ వాటిలో బిబిఏ, బిబిఏ డిజిటల్ మార్కెటింగ్ కీలకమని చెప్పాలి. తమ కళాశాలలో బిబిఏ ఫైనాన్స్, మార్కెటింగ్ ఇలాంటి వివిధ రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, చదువు పూర్తాకాకముందే విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆయన అన్నారు. ఇందుకు కారణం విద్యార్థులు అకడమిక్ నాలెడ్జ్‌తోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ అలవరుచుకోవడానికి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ మీద అవగాహన కలిగివుండటం అని అన్నారు. పి.వి.ఆర్ ట్రస్ట్ వారు నిర్వహించిన కామర్స్ & మేనేజ్‌మెంట్ ఫెస్ట్ నిర్వాహణ్-2కె26 లో పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్న తమ విద్యార్థినిలను అభినందించారు.

ఈ సందర్భంగా ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ ఇలాంటి పోటీలవల్ల విద్యార్థినిలలో ఆత్మవిశ్వాసం, పోటీతత్వం పెరిగి వారు మరిన్ని విజయాలు సొంతం చేసుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. కార్పొరేట్ ప్రపంచంలో తమ పూర్వ విద్యార్థులు మార్కెటింగ్, అడ్వర్టైజింగ్, బ్యాంకింగ్ కన్సల్టెన్సీ, డిజిటల్ మార్కెటింగ్, తదితర రంగాలలో ఉద్యోగాలు సాధించారని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినులకు కార్యనిర్వాహక నైపుణ్యాలు, మేధొపరిజ్ఞానం అలవరుతుందని తెలిపారు. ఆ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించిన బి.మీనాక్షిని ప్రశంసించారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు బి-క్వీజ్, బిజినెస్ ప్లాన్, ఎఫిలియేట్ మార్కెటింగ్ & యాడ్ మేకింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన విద్యార్థినిలు విజేతలుగా గెలుపొందడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు, విజేతలను అభినందించారు.

# భక్తుల సౌకర్యాలే లక్ష్యం





**- నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు లు అన్నారు. ఈ నెలలో జరగనున్న శ్రీ స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాన్ని పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అలాగే పలు అభివృద్ధి పనులు మరియు వకుళామాత అన్నదాన భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించి, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నిత్యాన్నదాన పథకానికి కాకినాడ, సిద్దార్థ నగర్‌కు చెందిన సానబోయిన నాగ రమేష్, వారి కుటుంబ సభ్యులు రూ.1,01,116 లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. దాతలకు చైర్మన్ డిప్యూటీ కమిషనర్ స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# కమనీయం రమణీయం శ్రీనివాసుని కల్యాణం





**ఎటపాక, మేజర్ న్యూస్ :** అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వరుని కళ్యాణం వైభవంగా జరిగింది. పోలవరం జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డి పేట, గుండాల కాలనీ గ్రామాల్లో కొలువై వున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో సోమవారం అంగరంగ వైభవంగా అలివేలు మంగ, పద్మ సమేత శ్రీ వెంకటేశ్వర కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీనివాసుని కల్యాణాన్ని కనులారా చూసి భక్తులు పరవశించి పోయారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆలయం నుంచి, అలివేలు మంగ, పద్మ సమేత వెంకటేశ్వర స్వామి వారిని పల్లకిలో ప్రత్యేకంగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. రక్షణ కంకణం, యావోనిత దారం, చేసి బెల్లం, పెరుగు, తేనె కలిపిన నైవేద్యంతో మధుపర్కం కార్యక్రమం నిర్వహించారు. కల్యాణంలో ముఖ్య ఘటమైన అలివేలు మంగ, పద్మావతి వెంకటేశ్వర స్వామివారికి జీలకర్ర, బెల్లం పెట్టి అనంతరం మాంగళ్య ధారణ జరిపించారు. నూతన వధువరులకు భక్తులు కట్న కానుకలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణ వేడుకను గొట్టు పుళ్ళ రాజా గోపాల్ చార్యులు, చక్రవర్తుల రఘునాథ చార్యులు, భారద్వాజ చార్యులు ఆలయ కమిటీ నిర్వహణ, ఈవో దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, రఘు పొంగువ చార్యులు, గొట్టు పుల్ల రాజ్ గోపాల్ చార్యులు, పొడిచేతి అభిరామ చార్యులు, వరుణ్ చార్యులు నిర్వహించారు. గుండాల కాలనీ గ్రామంలో నాంపల్లి జితేంద్ర చార్యులు శ్రీనివాసుని కల్యాణ కట్టాన్ని నిర్వహించడం జరిగింది. భక్తుల కొరకు వెంకటరెడ్డి పేట వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద భద్రాచలం కూరగాయల మార్కెట్, వెంకటేశ్వర రైస్ మిల్ యాజమాన్యం వెంకన్న బాబు, అడ్డంకి వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో వెంకటరెడ్డిపేటలో, గుండాల కాలనీ ఆలయం వద్ద ఏసుపాక వెంకటేశ్వర్లు, ఏసుపాక రాంబాబు మరియు కుటుంబ సభ్యులు, తోట శశి కుమార్ దంపతులు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటపాక సీఐ కన్నప్ప రాజు, ఎస్సై అప్పలరాజు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఆలయ కమిటీ సభ్యులు సాయిబాబు, మాదిరెడ్డి క్రిష్ణ బాబు, మాదిరెడ్డి మధు, మాదిరెడ్డి శ్రీనివాస్, వెంకన్నబాబు (రైస్ మిల్లు ), సురేంద్ర (బ్రదర్స్), ఇర్ప అజయ్, బొగ్గు వెంకటేష్, పాయం జోగయ్య, ఇర్ప సత్యం, సరియం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**- ఐటీడీఏ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలో గిరిజనులు సమస్యలు పరిష్కరించాలని పోలవరం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు.

సోమవారం రంపచోడవరం ఐటిడిఏ సమావేశం హాలులో వివిధ శాఖల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమం పోలవరం కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జి రెడ్డి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డి.ఎన్.వి. రమణ, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాజవొమ్మంగి మండలం బోయపాడు గ్రామంలో 9/1 గల సర్వే నెంబర్ ఒక ఎకరం 56 సెంట్లు భూ సమస్య పరిష్కరించాలని లోషిత రాజబాబు, కాకూరి రామయమ్మ, కాకూరి నాగమణి దరఖాస్తు సమర్పించారు. పోలవరం ముంపు బాధితులకు నేల దోనెలపాడు కొండ మొదలు గ్రామస్తులకు 12 ఎకరాల 30 సెంట్లు భూమి ల్యాండ్ టు ల్యాండ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ భూమి వెంటనే తమకు అప్పగించాలని వంజం జోగారావు, వేట్ల సత్యనారాయణ, కుంజం చరమయ్య దరఖాస్తు సమర్పించారు. గుర్తేడు మండలంలో పాయదారి పుట్ట నుండి గుర్తేడు స్కూలు వరకు 2.5 కిలోమీటర్లు రహదారి ఏర్పాటు చేయాలని, అల్లూరి గడ్డ నుండి గుర్తేడు రెండు కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటు చేయాలని, కదారికోట నుండి మెయిన్ రోడ్డు వరకు 2 కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని గుర్తేడు పంచాయతీ సర్పంచ్ గొర్లె దుష్యంతుడు దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం కాకవాడ నుండి మామిడి వలస వరకు రోడ్డు పూర్తి చేయాలని సర్పంచ్ విజయ భాస్కర్, బాబ్జి రెడ్డి, ఐచ్చల శ్రీదేవి, ఎస్ కళ్యాణి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏపీ-ఈఏపీసెట్-2026 దరఖాస్తులకు గడువు తేదీలలో మార్పు

**- కన్వీనర్ డా. ఎన్.మోహన్‌రావు వెల్లడి**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఏపీ-ఈఏపీసెట్-2026 ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు సంబంధించిన తేదీలలో మార్పులు జరిగినట్లు ఏపీ-ఈఏపీసెట్-2026 కన్వీనర్‌డా.ఎన్.మో హన్ రావు వెల్లడించారు. అభ్యర్థులు సవరించిన గడువులను గమనించి, సమయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సవరించిన గడువులు ఈ విధంగా ఉన్నాయి:

- ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 17-03-2026
- రూ.1,000లు ఆలస్య రుసుముతో చివరి తేదీ: 21-03-2026
- రూ.2,000లు ఆలస్య రుసుముతో చివరి తేదీ: 25-03-2026
- రూ.4,000లు ఆలస్య రుసుముతో చివరి తేదీ: 30-03-2026
- రూ.10,000లు ఆలస్య రుసుముతో చివరి తేదీ: 03-04-2026
- తప్పుల సవరణకు అవకాశం 04-04-2026 నుండి 06-04-2026 వరకు కల్పించబడింది.

డా. ఎన్.మోహన్‌రావు మాట్లాడుతూ, అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లోని మార్గదర్శకాలను జాగ్రత్తగా పరిశీలించి, గడువులకు ముందుగానే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు చివరిరోజు వరకు ఆగకుండా ముందస్తుగా నమోదు చేసుకోవడం మంచిదని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి సవరించిన తేదీలను గమనించాల్సిందిగా కోరారు.

# సంపూర్ణ చంద్రగ్రహణం

**– ప్రముఖ సిద్ధాంతి చీమలకొండ వీర భద్ర ప్రసాద్**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ అనగా ది. 03.03.2026 వ తేదీ మంగళవారం రాత్రి
కేతు గ్రస్తం, కృష్ణవర్ణం, గ్రస్తోదయ స్వల్ప చంద్రగ్రహణం
స్పర్శ కాలం (పట్టు) మధ్యాహ్నం గం 03 : 20 ని//లు (కనిపించదు)
మధ్య కాలం(మధ్య) సాయంత్రం గం 05 : 03 ని//లు
సూర్యాస్థమము సాయంత్రం గం 06 : 09 ని//లు
మోక్షకాలం (విడుపు) రాత్రి గం 06 : 48 ని//లు
గ్రహణం ఆద్యంతపుణ్యకాలం గం 00 : 39 ని//లు
ఈ చంద్రగ్రహణం 39 ని//లు మాత్రమే కనబడును.

01) ఈ గ్రహణం పుబ్బ నక్షత్రం సింహ రాశి నందు సంభవించుచున్నది కావున పుబ్బ నక్షత్ర జాతకులు మరియు సింహ వారు గ్రహణం చూడరాదు అలాగే గ్రహణ అనంతరం తరువాత రోజు ఉదయం యధావిధిగా గ్రహణ శాంతి చేసుకొనవలెను.

02) గ్రహణం రోజు యధావిధిగా గ్రహణానంతరం శుద్ధిచేసుకొని రాత్రి ప్రత్యాబ్దికములను నిర్వహించు కొనవలెను.

03) మధ్యాహ్నన్న భోజనాదులు యధావిధిగా మధ్యాహ్నం12 గంటలలోపు పూర్తి చేయుట మంచిది. 04) ది.04.03.2026 బుధవారం గ్రహణశూల కావున దూరప్రయాణములు చేయరాదు.

– గ్రహణశాంతి

పుబ్బ నక్షత్ర జాతకులు సింహ వారు జన్మ రాశి, జన్మ నక్షత్ర గ్రహణ దోష నివృత్యర్థం శుభఫల ప్రాప్తికొరకు వెండిచే చంద్ర బింబాన్ని , బంగారంతో నాగబింబాన్ని చేయించి 1కేజీ బియ్యం,1కేజీ ఉలవలు, పంచెలచాపు(వస్త్రము),దక్షిణ, ఆవు నేతితో నింపిన రాగి పాత్రతో గ్రహణ అనంతరం తరువాత రోజు ఉదయం బ్రాహ్మణుడికి దానమీయవలెను. ఈ విధంగా చేయలేనివారు మహాన్యాస పూర్వక ఏకాదశ పూర్వక రుద్రాభిషేకం చేయించిన గ్రహణశాంతి కలుగగలదు.

గ్రహణ గోచారం

01) తుల – వృశ్చికం – మీనం – మిధున రాశులవారికి శుభఫలం
02) ధనుస్సు – కుంభం – మేషం – కర్కాటక రాశులవారికి మద్యమఫలం
03) సింహం – కన్య – మకరం – వృషభం రాశులవారికి అధమఫలం

– గ్రహణ ఫలితం

ఈగ్రహణ ప్రభావం వలన మత విద్వేషాలు అధికంగా ఉంటాయి, సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఏర్పడవచ్చు, అధికారమున వున్న స్త్రీలు, ఆయుధ నిర్మాణములు చేయువారు, క్షత్రియులు, వ్యాపార రంగము నందు వర్తకులు, ఆశ్మక,అవంతిక,మేఖల దేశములు సమస్యలను ఎదుర్కొంటారు, దేశ సరిహద్దు ప్రాంతాలలో యుద్ధ వాతావరణం ఉంటుంది. తపస్సు చేసుకొనువారలకు అరిష్టకరము.

# డిడిఓ కోటేశ్వరరావుకు ఘన సత్కారం

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం (రంపచోడవరం) జిల్లా డిడిఓ, డిపిఓ కె.కోటేశ్వరరావు పనిచేసి పదవీ విరమణ చేసిన సందర్భం గా సోమవారం ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఆర్ జిల్లా డిపిఓ చంద్రశేఖర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్, డివిజనల్ పంచాయితీ అధికారి, జిల్లా పంచాయితీ అధికారి, ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన కోటేశ్వరరావు వారి సహా భాగస్వామికు సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. గత 28 సం.రాలుగా పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్లో వివిధ పదవులు చేసి పదవీ విరణ చేసినందుకు పలువురు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన కోటేశ్వరరావు మాట్లాడుతూ సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంగా బొజ్జయ్య, జిల్లా పంచాయితీ



అధికారి పి.చంద్రశేఖర్, ఏ.పి.డి. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. రాంబాబు, జిల్లా లోని మండల పరిషత్ అభివృధి అధికారులు డిప్యూటీ ఏం. పి.డి.ఓ.లు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్,ఎన్.ఆర్. ఈ.జి.ఎస్., డి. పి .ఓ. అండ్ డి.ఎల్. పి.ఓ. కార్యాలయ సిబ్బంది జిల్లా లోని అందరు పంచాయితీ కార్యదర్శులు మండల లెవెల్ కోఆర్డినేటర్లు అన్ని మండలాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఇజి ఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వెలిచేరు విద్యార్థుల ప్రతిభ

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : అమలాపురం కిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలో మండలంలోని వెలిచేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గొలకోటి శ్రీ రమ్య, వానపల్లి లక్ష్మి లిఖితశ్రీ, ఎలమంచిలి వెంకట దుర్గ పార్వతి, తమ్మిశెట్టి వినయ్ తమ ప్రతిభను ప్రదర్శించి ఏకపాత్రాభినయంలో జిల్లా ప్రథమస్థానం పొంది అందరి మన్ననలు పొంది నగదు బహుమతులు కూడా గెలుచుకున్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులు కసిమేడ సోమశేఖర్, విద్యా కమిటీ చైర్మన్ మెర్ల అంజిబాబు, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, విజయ దుర్గ లు అభినందించారు.

# బాలికల బీమా క్లెయిమ్స్‌పై మండలిలో ఎమ్మెల్సీ వంక ప్రశ్నకు కదలిన ఫైలు






**– సంబంధిత శాఖకు తక్షణ చర్యల ఆదేశాలు**

**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ప్రస్తావించిన బాలికా సంరక్షణ బీమా పథకం క్లెయిమ్స్ అంశం ప్రభుత్వ దృష్టిని గట్టిగా ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ప్రత్యేక ప్రస్తావనగా ఈ విషయాన్ని లేవనెత్తగా మార్చి 2 వ తేదీ సోమవారం శాసన మండలి లెజిస్లేటివ్ రిపోర్టింగ్ విభాగం సంబంధిత ఫైల్‌ను మంత్రి గుమ్మడి సంధ్యారాణికు పంపింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలానికి చెందిన సుమారు 4500 మంది బాలికల బీమా క్లెయిమ్స్ పరిష్కారంపై సమగ్ర వివరాలు సమర్పించాలని కోరుతూ, ఈ అంశం మంత్రి పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. అలాగే మహిళా, శిశు మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులను తక్షణం ఆదేశించి పూర్తి సమాచారం సేకరించి, శాసన మండలి కార్యాలయానికి నివేదిక అందించాలని సూచించినట్లు తెలిసింది. బాలికల భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది. క్లెయిమ్స్ త్వరితగతిన పరిష్కారమవుతాయా అన్నదానిపై బాధిత కుటుంబాలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఫైల్ కదిలిన విషయాన్ని తెలుసుకున్న పెరవలి మండలానికి చెందిన బాలికల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేసిన శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ కు తామంతా రుణపడి ఉంటామని అన్నారు.

## పూర్తిస్థాయి సిబ్బందిని నియమించండి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం మొగళ్ళమూరు గ్రామ పంచాయతీ పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరుతూ బిజెపి అల్లవరం మండల అధ్యక్షుడు నారాయణమూర్తి జాయింట్ కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. అల్లవరం మండలం గ్రామపంచాయతీలో సిబ్బంది కొరత వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కనుక పూర్తిస్థాయి సిబ్బందిని నియమించవలసిందిగా జాయింట్ కలెక్టర్ నిశాంతికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కట్టా జనార్ధన్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, అంగాని ధనుంజయ వర్మ పాల్గొన్నారు.

## నెల 6న సుబ్బాలమ్మ ఆలయ అష్టమ వార్షికోత్సవం



**అమలాపురం, మేజర్ న్యూస్ :** స్థానిక గోల్డ్ మార్కెట్ వేంచేసియున్న శ్రీ సుబ్బాలమ్మ అమ్మవారి పునః ప్రతిష్ఠ అష్టమ వారికోత్సవాన్ని ఈ నెల 6న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని ఆలయ చైర్మన్ అప్పన వీర వెంకట భైరవస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో భైరవస్వామి మాట్లాడుతూ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా సుబ్బాలమ్మ అమ్మవారికి ఉదయం 6గంటల నుండి గణపతి పూజ, పంచామృత అభిషేకం, కుంకుమార్చన, నవశక్తి, నవచండీ, అష్టలక్ష్మి హోమం జరిపిస్తామన్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ అమలాపురం ఎజి రోడ్డులో సుబ్బాలమ్మ వారికి చెందిన 3.5 ఎకరాల భూమి అన్యాక్రాంతం అయ్యిందన్నారు. గతంలో హైకోర్టు తాము హైకోర్టును ఆశ్రయించగా దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దీంతో ఇటీవల ముగ్గురు వ్యక్తులు స్వచ్ఛందంగా దేవస్థానం భూమిని ప్రభుత్వానికి అప్పగించారన్నారు. మరో 8మంది దేవస్థానానికి భూమిని అప్పగించాల్సి ఉందని వారికి నోటీసులు జారీ చేసామన్నారు.

## ఇంటి పన్నుల వసూళ్ళు తీరు పరిశీలన

**– డిఎల్‌పిఓ బాలామణి**






**పెద్దాపురం రూరల్,మేజర్ న్యూస్ :** పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్ని పంచాయ తీలలో ఇంటి పన్నుల వసూ ళ్ళను పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది, త్వరితగతిన ప్రభు త్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వసూలు చేయాలని పెద్దాపురం డిఎల్‌పిఓ ఎం.బాలామణి తెలిపారు. దీనిలో భాగంగా పెద్దాపురం మండలంలో దివిలి, చంద్రమాంపల్లి, గ్రామాలలో ఇంటి పన్నుల వసూళ్ళ తీరును ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.శేఖం రెడ్డిలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పన్నుల వసూళ్ళలో పంచాయతీ సెక్రటరీలు నిర్లక్ష్యం వహించరాదని, అలాగే శానిటేషన్, డోర్ టు డోర్ చెత్త సేకరణ వంటి వాటిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిలో భాగంగా కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాలలో ఆయా పంచాయతీలలో ఇంటి పన్నుల వసూళ్ళ తీరుతో పాటు శానిటేషన్, ఎస్.డబ్ల్యూ.పి. షెడ్‌ల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ వంటివాటిపై పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ సెక్రటరీలు ఈశ్వరరావు, షావలి, పద్మరాజు, రమేష్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# మన కాకినాడ.. మన బాధ్యత






**- అందమైన నగరంలో 'అంతర్మథనం'!**

**- అవార్డుల వెలుగులు.. మౌలిక వసతుల మెరుగులు**

**- సైకాలజిస్ట్ డాక్టర్ ఏపీజే విను హృదయపూర్వక విన్నపం**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**
గోదావరి తీరాన ఒదిగి ఉన్న మన కాకినాడ నగరం అంటే మనందరికీ ప్రాణం. పచ్చని చెట్లు, విశాలమైన రోడ్లు, ప్రశాంతమైన జీవనం.. ఇవే మన నగరానికి అసలైన అందాలు. ప్రస్తుతం మన నగరం 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవార్డు కోసం ముస్తాబవుతోంది. ఈ క్రమంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే, ఈ మెరుగులతో పాటు మన నగరం ఎదుర్కొంటున్న కొన్ని ప్రాథమిక సమస్యలను కూడా ప్రేమతో, బాధ్యతతో సరిదిద్దుకుంటే ఎలా ఉంటుంది? ఇదే అంశంపై ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఏపీజే విను గారు లోతైన, సున్నితమైన విశ్లేషణను మన ముందు ఉంచారు. అది ఇప్పుడు నగర పౌరులందరినీ ఆలోచింపజేస్తోంది.

**అభివృద్ధి అంటే.. ఒక నిరంతర ప్రయాణం!**

అభివృద్ధి అనేది కేవలం ఒక అవార్డు కోసమో, ఒక నెల రోజులు చేసే హడావిడి కోసమో కాకూడదు. అది మన దైనందిన జీవితంలో భాగం కావాలి. "మనం మన ఇంటిని ఎలాగైతే నిరంతరం శుభ్రంగా ఉంచుకుంటామో, మన నగరాన్ని కూడా అలాగే చూసుకోవాలి" అని డాక్టర్ విను ఆకాంక్షించారు. ముఖ్యంగా భూపతి నగర్ లాంటి ప్రాంతాల్లోని బహిరంగ వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించి, అక్కడ నివసించే చిన్నపిల్లల, వృద్ధుల ఆరోగ్యానికి భరోసా కల్పించాల్సిన అవసరం మనందరిపైనా ఉంది.

**చిన్న మార్పు.. గొప్ప పరిష్కారం!**

డాక్టర్ విను లేవనెత్తిన 21 అంశాలు ఎవరినో విమర్శించడానికి ఉద్దేశించినవి కావు. అవి మన నగరాన్ని మరింత మెరుగుపరుచుకోవడానికి మన ముందున్న అవకాశాలు.

- భద్రత: రోడ్లపై వేలాడుతున్న కేబుల్ వైర్లను క్రమబద్ధీకరించడం, గుంతలు లేని ప్రయాణాన్ని అందించడం.
- పర్యావరణం: నాటిన ప్రతి మొక్కకూ ఒక రక్షణ కవచం ఉండటం, ఎండిపోతున్న పార్కులకు మళ్లీ జీవం పోయడం.
- క్రమశిక్షణ: రోడ్లపై పశువుల సంచారాన్ని నియంత్రించడం, ప్లాస్టిక్ రహిత నగరంగా కాకినాడను తీర్చిదిద్దడం.

ఇవన్నీ మనం కొంచెం శ్రద్ధ పెడితే సులభంగా పరిష్కరించుకోగలిగే అంశాలే.

**మేధావులారా.. ఆలోచించండి!**

ఈ మార్పు కేవలం అధికారుల వల్లే సాధ్యం కాదు. నగరంలోని డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, మరియు మేధావి వర్గం తమ వంతు సలహాలను, సూచనలను అందించాలి. కాలనీ అసోసియేషన్లు కేవలం ప్రతినిధులుగా కాకుండా, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులకు వారధిలా నిలవాలి. గృహిణులు, విద్యార్థులు తమ వంతుగా 'స్వచ్ఛత'ను ఒక జీవనశైలిగా మార్చుకోవాలి.

**రేపటి తరం కోసం.. ఒక అడుగు!**

"మనం మన పిల్లలకు ఇచ్చే అతిపెద్ద ఆస్తి ఆరోగ్యకరమైన వాతావరణం." మన చేతిని మన గుండె మీద వేసుకుని ఆలోచిద్దాం.. మన నగరాన్ని కేవలం అవార్డుల కోసం సిద్ధం చేస్తున్నామా? లేక మన భవిష్యత్తు తరాల సుఖవంతమైన జీవనం కోసం పునాదులు వేస్తున్నామా?
అవార్డు రావడం మనందరికీ గర్వకారణమే.. కానీ ఆ అవార్డు వెనుక వంద శాతం సంతృప్తి చెందిన పౌరుడు ఉన్నప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుంది. రండి! మనమందరం కలిసి డాక్టర్ వినుఆలోచనలకు అడుగులు కలిపి, మన కాకినాడను నిజమైన స్మార్ట్ నగరంగా మార్చుకుందాం.

# రెండు రోజులు.. ఎన్నో మధుర స్మృతులు

**- ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతంపై హర్షం**

**- చైతన్యరాజుకు అభినందనల వెల్లువ**



**అమలాపురం, మేజర్ న్యూస్ :** తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటేందుకు అమలాపురం కిమ్స్ వేదికగా రెండు రోజులపాటు నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం అయ్యాయి.. ఎందరో మహోన్నతులు ఈ మహా సభలకు విచ్చేసి తెలుగును వెలిగిద్దాం అంటూ ప్రతినబూనారు.. ప్రపంచ తెలుగు మహాసభల విజయవంతంపై కార్యక్రమ నిర్వహకులను అభినందనతలతో ముంచెత్తుతున్నారు.. ఇటు తెలుగు భాషను ప్రేమించే వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.. సభల విజయవంతం చేసినందుకు కృషిచేసిన అందరికీ తెలుగు మహా సభల నిర్వాహకులు, కిమ్స్, చైతన్య విద్యా సంస్థల ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్ కె.వి.వి సత్యనారాయణ రాజు(చైతన్య రాజు) కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలనుండే కాక దేశ విదేశాల లోని అనేక మంది తెలుగు వారి నుండి విశేష స్పందన లభించిందని, సుమారు 50 వేల మందికి పైగా ప్రత్యక్షంగా హాజరు కాగా లక్షల సంఖ్యలో తెలుగు వారు సాంఘిక మాధ్యమాల ద్వారా ఈ సభలను వీక్షించి స్పందించడం చాలా సంతోషదాయకం, స్ఫూర్తిదాయకమని చైతన్య రాజు అన్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒరిస్సా రాష్ట్రాల గవర్నర్లు, అనేక మంది న్యాయ మూర్తులు, కేంద్ర మరియు రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, తెలుగు పండితులు, ప్రవచన కర్తలు, అష్టావధానులు, శత, సహస్రావధానులు, రాష్ట్రం నాలు మూలాల నుండి కవులు, తెలుగు భాషాభిమానులు విచ్చేసి ఈ ప్రపంచ మహా సభలను విజయవంతం చేయడంలో భాగస్వాములైన వారందరికీ పేరు పేరునా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సభలలో 16 తెలుగు సాహిత్య సదస్సులు, సుమారు 150 మంది కవులచే జరిపిన కవి సమ్మేళనం అద్భుతం, అనూహ్యం మరియు అమృత కలశం అని మరియు అంతమంది కవులు మరియు పండితులకు ఒకే వేదికపై సన్మానం అరుదైన అవకాశమన్నారాయన. ప్రతి యేటా ఇదే విధంగా భాగస్వాములై సహాయ సహకారాలు అందజేసి తెలుగు మహా సభలను విజయవంతం చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు తోడ్పడాలని చైతన్య రాజు, కిమ్స్ ఎం.డి. రవి కిరణ్ వర్మ, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ శశికిరణ్ వర్మ కోరారు.

## పులి సంచారంపై జిల్లా కలెక్టర్ స్పందన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఈ ప్రాంతంలోని పులి సంచారంపై ఈ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా తగు చర్యలు చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలవరం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో రంపచోడవరం మండలం వేములకొండ, ఆకూరు పంచాయతీలకు సంబంధించిన గిరిజనులు మా ప్రాంతంలోని పులి సంచారం వలన భయభ్రాంతులకు గురై బయటికి రావడానికి భయపడుతున్నామని మా ప్రాంతంలోని పులి సంచారం చేయకుండా నిర్మూలించే విధంగా తగు చర్యలు చేపట్టాలని గిరిజనులు జిల్లా కలెక్టర్ వారికి విన్నవించగా వెంటనే పోలవరం జిల్లా కలెక్టర్ ఏఎస్. దినేష్ కుమార్ స్పందించి పులి సంచారంపై ఏటువంటి భయభ్రాంతులకు గురికాకుండా ఫారెస్ట్ అధికారులతో సంప్రదించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. పులికి జియో టాకింగ్ ఉందని అదేవిధంగా పులి ఎక్కడ తిరిగినా జియో టాకింగ్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకొని ఆయా గ్రామ ప్రజలకు ఫారెస్ట్ శాఖ ద్వారా అప్రమత్తం చేయడం జరుగుతుందని అదేవిధంగా అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాంతంలోని సంచరించే పులి గురించి ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఎస్టి కమిషన్ మెంబర్ గొర్లె సునీత, సబ్ డిఎఫ్ఓ సుబ్బారెడ్డి, ఏపీవో జనరల్ డి.ఎన్.వి.రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, సర్పంచ్ విజయభాస్కర్ రెడ్డి, బచ్చల శ్రీదేవి, బి.బోజ్జి రెడ్డి, యస్.కళ్యాణి, సతీష్ బాబు, వెంకటేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి ప్రాజెక్టును సాధించిన 'బివిసి' ప్రొఫెసర్లు




**అల్లవరం, మేజర్ న్యూస్ :** స్థానిక బోనం వెంకట చలమయ్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు ప్రొఫెసర్లు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టును సాధించారు. కళాశాల ప్రొఫెసర్లు అయ్యగారి నాగేశ్వర రావు, శ్రీపాద రామకృష్ణ మరియు ఆకుల ప్రవీణ్ సంయుక్తంగా "గోదావరి జిల్లాల వైదిక వారసత్వంపై విశ్లేషణాత్మక అధ్యయనం" అనే జాతీయస్థాయి ప్రాజెక్టును కైవసం చేసుకున్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖలోని భారతీయ జ్ఞాన పరంపర (ఐకెఎస్) విభాగం వారు ఈ ప్రాజెక్టుకు ఎంపిక అయినట్లు ఒక ప్రకటనలో తెలియజేసింది. దేశవ్యాప్తంగా ఎంపికైన కొద్ది ప్రాజెక్టుల్లో తమ ప్రాజెక్టు ఒకటిగా నిలవడం ఇక సదవకాశమని పరిశోధక బృందం అన్నారు. గోదావరి జిల్లాల్లోని సంప్రదాయాలు, ఆచారాలు, పద్ధతులను సమగ్రంగా విశ్లేషించి, వాటి సామాజిక, సాంస్కృతిక ప్రభావాలను అధ్యయనం చేయడం లక్ష్యంగా ఈ పరిశోధన సాగుతుంది అనీ,తద్వారా భారతీయ జ్ఞానపరం పరను ఆధునిక సందర్భంలో ప్రాముఖ్యతతో పరిచయం చేయాలనుకుంటున్నామని వారు ప్రాజెక్టు సారాంశాన్ని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో కళా శాల విద్యా, పరిశోధనా రంగాల్లో మరో మైలురాయిని అధిరోహించినట్లైందని ప్రిన్సిపాల్ డి.మహేశ్వర్ అన్నారు. కళాశాల సెక్రెటరీ బోనం కనకయ్య, చైర్ పర్సన్ బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్. డి.మహేశ్వర్, కార్యనిర్వహణాధికారి ఎ.వై.ఆర్.వి.ప్రసాద్ తదితరులు ఈ సందర్భంగా హృదయ పూర్వక అభినందనలు తెలియజేసి, ఈ ప్రాజెక్టు విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తిని పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రధాన డ్రైన్ పనులు ప్రారంభం





**– మళ్లీ ఆక్రమణలు మార్కింగ్**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరంలో ఎట్టకేలకు ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డుకు ఇరువైపులా డ్రైన్ పనులు ప్రారంభమయ్యాయి. ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.3 కోట్ల 60 లక్షలు వ్యయంతో రహదారులు భవనాలు శాఖ డ్రైన్ పనులు ప్రారంభించింది. అలాగే రంపచోడవరంలో రోడ్డు కు ఇరువైపులా ఆక్రమణలు తొలగింపుకు మళ్లీ రెండోసారి మార్కింగ్ ఇచ్చారు. పోలవరం నూతన జిల్లా ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో ప్రధాన రహదారితో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్ లో మరలా ఆక్రమణలు పెచ్చుమిరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆరు మాసాల క్రితం రంపచోడవరం ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపు అధికారులు నిర్వహించారు. దీంతో ప్రభుత్వ భవనాలు మినహా ప్రైవేట్ వ్యాపారులకు సంబంధించిన భవనాలు, దుకాణాలు కొంతవరకు తొలగించారు. అయితే అన్ని ప్రాంతాలలోనూ రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు మార్కింగ్ ఇచ్చిన ఆక్రమ నిర్మాణాలు పూర్తిగా తొలగించకపోవడంతో కొన్నిచోట్ల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇదిలావుండగా రంపచోడవరంలో గతంలో ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో మళ్ళీ ఆక్రమణలు పెరుగుతున్నాయి. రాత్రికి రాత్రే పాకలు, పందిర్లు, రేకులతో షెడ్లు వేయడంతో పాటు ప్రభుత్వ స్థలాలను యదేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. మరికొంతమంది గ్రీన్ క్లాత్ తో రోడ్డు ప్రక్క స్థలాల్లో అక్రమంగా వ్యాపారాలకు అద్దెకు ఇచ్చేందుకు పాగా వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో రోడ్డు ప్రక్క స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని గ్రామపంచాయతీ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని ఖాతరు చేయకుండా కొంతమంది వ్యాపారులు స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలు కొనసాగిస్తున్నారు. కాగా రాజకీయ నాయకుల సిఫార్సులతో ఆక్రమణ ప్రదేశాల్లో నిబంధనలు పాటించకుండా విద్యుత్ అధికారులు విద్యుత్ మీటర్లు ఇవ్వడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రంపచోడవరంలో ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్ లో డ్రైనేజీ నిర్మాణానికి మూడున్నర కోట్లు రూపాయలు నిధులు మంజూరు అయ్యాయి. డ్రైనేజీ నిర్మాణం జరిగే ప్రాంతాల్లోనూ ఆక్రమణలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. రంపచోడవరంలో ఆక్రమణలు తొలగించే విషయంలో రహదారులు భవనాల శాఖ, రెవిన్యూ శాఖ, గ్రామపంచాయతీ మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో ప్రభుత్వ స్థలాలు యదేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని గతంలో రహదారులు భవనాల శాఖ, పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు పంపడం జరిగిందని స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రెవిన్యూ శాఖ ఆదేశాలు ఇస్తే ఆక్రమణలు తొలగించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని రహదారులు భవనాల శాఖ, గ్రామపంచాయతీ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం పోలవరం జిల్లా కేంద్రంగా రంపచోడవరం మారడం వల్ల భవిష్యత్ అవసరాలకు ఆక్రమణ స్థలాలు విషయంలో అధికారులు వెంటనే స్పందించకపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవు. గిరిజన మహిళల పేరుతో కొంతమంది గిరిజనేతర వ్యాపారులు రోడ్డు పక్క స్థలాలు ఆక్రమించి అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ లబ్ధి పొందాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆక్రమణలు తొలగింపుతో ఉపాధి కోల్పోయిన కొంతమంది గిరిజన వ్యాపారులకు స్థలం కేటాయించి దుకాణాలు ఏర్పాటుకు సహకరిస్తామని గతంలో అధికారులు చెప్పినప్పటికీ నేటి వరకు కార్య రూపం దాల్చలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రంపచోడవరంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

**– ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి**

**– డిప్యూటి కమిషనర్ కె.శ్రీనివాస్ ఆదేశాలు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగవంతంగా పరిష్కరించాలని నగర పాలక సంస్థ డిప్యూటి కమిషనర్ కె.శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో ఆయన పాల్గొని ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుండి మొత్తం 19 మంది ప్రజలు హాజరై తమ సమస్యలను డిప్యూటి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వీటిలో ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల మరమ్మతులు, పన్నుల సమస్యలు మరియు ఇతర పౌరసేవలకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. "డయల్ యువర్ కమిషనర్" కార్యక్రమంలో ముగ్గురు పౌరులు ఫోన్ కాల్ ద్వారా తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటి కమిషనర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడం సంస్థ యొక్క ప్రాధాన్య కర్తవ్యమని తెలిపారు. అందిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి, జాప్యానికి తావులేకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన స్పష్టంగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీసీపీ పి.కృష్ణారావు, మేనేజర్ శిరీష్ కుమార్, టిపిఆర్వో శైలజ, డీఈలు లక్ష్మి, శివప్రసాద్, ప్రవీణ్ చంద్ర, సచివాలయ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాడపల్లిలో పల్లె నిద్ర



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని వాడపల్లి గ్రామం పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, సబ్–ఇన్స్పెక్టర్ ఎస్.రాము, సిబ్బంది స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పరిస్థితులు, అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నియమాలు, పోక్సో యాక్ట్ మరియు సోషల్ మీడియా పోస్టులు తదితర విషయాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. అంతేగాక ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల తీరుతెన్నుల గురించి వాటి బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించవలసిన తీరును గురించి అవగాహన కల్పించారు. అలాగే గ్రామ పరిధిలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీస్‌శాఖ చర్యలు తీసుకునేందుకు గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించిన సమాచారాన్ని, చెడు నడత కలిగిన వ్యక్తులు, కొత్త వ్యక్తుల యొక్క కదలికలను గురించిన సమాచారం పోలీస్ శాఖకు తెలియపరచాలన్నారు.ఈ కార్యక్రమములో వాడపల్లి గ్రామ పెద్దలు, యువకులు, పాల్గొని గ్రామ సమస్యలు గురించి చర్చించటం జరిగింది.

# నష్టపరిహారం విషయంలో తప్పు చేస్తే శాఖాపర చర్యలు




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** చింతూరు డివిజన్ పరిధిలో నాలుగు మండలాలకు సంబంధించిన పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు నష్టపరిహారం విషయంలో ఎవరైనా వాల్యూయేషన్లో తప్పు చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలవరం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాల్లో పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో, తాసిల్దారులతో, వివిధ శాఖలకు సంబంధించిన ఇంజనీర్లతో, సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధన ప్రకారం వ్యాల్యూషన్ చేయుటకు పోలవరం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ , పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన చింతూరు డివిజన్లోని నాలుగు మండలాలకు సంబంధించిన బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా నష్టపరిహారం చెల్లింపులలో ఎవరైనా వాల్యుయేషన్ లో తప్పులు చేసిన ఎడల తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. 12 నెలలలో గిరిజనులకు, గిరిజనేతలకు ఎక్కడెక్కడ ఆర్ అండ్ ఆర్ కాలనీలోకి సంబంధించిన భూములు గుర్తించింది మండలాలవారిగా ఆయన ఆరా తీశారు. ఒక్కొక్క గ్రామంలో ఎంతమంది గిరిజనులు ఉన్నది అదేవిధంగా గిరిజనేతరులు ఎంతమంది ఉన్నది గిరిజనులకు ల్యాండ్ టు ల్యాండ్ గిరిజన ప్రాంతంలోని ఏర్పాటు చేయడం జరుగుతుందని అదేవిధంగా గిరిజనేతరులకు మైదాన ప్రాంతంలోని ఇళ్ల స్థలాలకు ఎన్ని ఎకరాలు భూమి గుర్తించింది ఆయన ఆరా తీశారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం ఆర్ అండ్ ఆర్ అమలకు నిధులకు కొరత లేదని ఆయన అన్నారు. ముంపు గ్రామాలలో ఇన్యుమురేషన్ ఎ విధంగా చేసింది ఆయన ఆరా తీశారు. 2027 మార్చినాటికి పోలవరం ముంపు బాధితుల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టు అధికారులకు టార్గెట్ ఇవ్వడం జరుగుతుందని టార్గెట్ ప్రకారం విధులు నిర్వహించవలసి ఉంటుందని ఆయన అన్నారు. వాల్యుయేషన్ చేసిన వాటికి నివేదికలతో పాటు ఫోటోలు కూడా సమర్పించాలని ఆయన అన్నారు. పోలవరం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయెడల మా దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ముంపునకు గురైన గిరిజనులకు ఏజెన్సీ ప్రాంతంలోనే వాళ్లకు నచ్చిన భూములలో ఆర్ అండ్ ఆర్ కాలనీలు ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగమల్లేశ్వర రావు, షేక్ ఇంతియాజ్ భాష, బాలకృష్ణ, చంద్రశేఖర్ రెడ్డి, ఆంజనేయులు, తాసిల్దార్లు సిహెచ్ శ్రీనివాసరావు, బాలాజీ, వేణుగోపాల్, ఎ.సత్యనారాయణ, దొరకయ్య, సయ్యద్ భాష, ధర్మేందర్ కుమార్, సరస్వతి, శ్రీనివాసరావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, డిఇలు భవాని, రామచంద్ర మూర్తి, డిప్యూటీ తాసిల్దార్ త్రిమూర్తులు, గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.